# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | మంగళవారం 08-04-2025 | సంపుటి : 06 | సంచిక : 328 | పేజీలు : 8 | వెల : రూ 1-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్,B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



## ఒంటిమిట్టలో మంత్రుల బృందం పర్యటన

కడప ఒంటిమిట్ట శ్రీరాముల కళ్యాణోత్సవం ఏర్పాట్లపై మంత్రుల బృందం సందర్శించింది. ఒంటిమిట్ట శ్రీరాముల కళ్యాణ మహోత్సవం కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 11న సీఎం చంద్రబాబు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి నేతృత్వంలో సోమవారం ఆలయం వద్ద ఏర్పాట్లను మంత్రుల బృందం సమీక్షించింది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పలువురు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరావతిలో మెగా హెల్త్ హబ్ ఏర్పాటు

**200 ఎకరాల్లో ఏర్పాటుకు యత్నం**
**ప్రతి నియోజకవర్గంలో వందపడకల ఆస్పత్రి**
**ప్రజల హెల్త్ వివరాలతో డిజిటల్ కార్డులు**
**జూన్ 15నకుప్పంలో ప్రారంభం**
**హెల్త్‌పై సిఎం చంద్రబాబు వివరణ**

అమరావతి,ఏప్రిల్7: అమరావతిలో మెగా హెల్త్ హబ్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ప్రకటించారు. రాజధాని అవసరాలతో పాటు,రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రులు నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. త్వరలోనే ఏపీ వ్యాప్తంగా ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తాం.. ప్రస్తుతం పైలట్‌గా డిజిటల్ హెల్త్ నర్వ్ సెంటర్ ను కుప్పంలో చేశాం.. త్వరలో చిత్తూరు జిల్లాలో చేయబోతున్నాం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ హెల్త్ రికార్డ్స్ తయారు చేస్తాం.. త్వరలో పిల్లల హెల్త్ రికార్డు లను కూడా డిజిటల్ లాకర్ లో పెడతాం.. ఏపీలో అందరికీ ఐడీ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో సీఎం మాట్లాడుతూ.. ఏపీలో వైద్యం, ఆరోగ్యంపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఏపీలో పెరిగిన వైద్య ఖర్చులు, వివిధ వ్యాధుల వివరాలు వెల్లడించారు. అమరావతిలో మెగా గ్లోబల్ మెడిసిటీ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని.. మొత్తం 200 ఎకరాలు ఇందుకు అవసరం అవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇది ఏర్పాటు చేస్తుందన్నారు. అమరావతిలోని హెల్త్ సిటీలో ఏర్పాటు చేస్తామన్నారు. అతి త్వరలో దీనిపైన నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రులు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. 19,264 కోట్లు- వైద్యారోగ్యశాఖలో ఖర్చు చేస్తున్నామని.. ఆశించిన ఫలితాలు మాత్రం రావడంలేదన్నారు. ఆసుపత్రుల్లో రూమ్ ఛార్జీలు ఎక్కువ అవుతున్నాయని.. అందుకే ఓ వినూత్నమైన ప్రయోగం చేస్తున్నామని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో 100 - 300 పడకల ఆస్పత్రుల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాల్లో గుండె సంబంధిత ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో డయాబెటీ-స్ ఎక్కువగా ఉందన్నారు. ప్రకాశం, కర్నూలు అనంతపురంలో రెస్పిరేటరి సంబంధిత వ్యాధులు వ్యాప్తి జరుగుతోందని సీఎం అన్నారు. ఎన్సీడీ సర్వే 2.0 జరిగిందని.. ఇప్పుడు 3.0 జరుగుతోందన్నారు. ఐదేళ్లలో ఆసుపత్రులకు వచ్చిన డేటా ఆధారంగా ఏ జిల్లాల్లో ఏ వ్యాధి ఎక్కువ అనే లిస్ట్ సిద్ధం చేశామన్నారు.8 లక్షల మంది బీపీ, షుగర్ బాధితులు చికిత్స తీసుకోవడం లేదన్నారు. షుగర్ వ్యాధి స్త్రీలు, పురుషులకు సమానంగా వస్తోందని తెలిపారు. ఆహారపు అలవాట్ల వల్లే షుగర్ ఎక్కువగా వస్తోందన్నారు. ఆడవాళ్లలో గుండె సబంధిత వ్యాధులు తక్కువ వస్తున్నాయని తెలిపారు. క్యాన్సర్ విషయంలో ఆడవాళ్లు ఎక్కువగా బాధపడుతున్నారన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారన్నారు. లివర్ సంబంధిత వ్యాధులు మగవారికి ఎక్కువగా వస్తున్నాయని.. దీనికి కారణం లిక్కర్ అని అన్నారు. న్యూరలాజికల్ ఇష్యూలు మిడిల్ ఏజ్‌లో ఎక్కువ వస్తున్నాయని చెప్పారు. మగవారికి హైపర్ టెన్షన్ తక్కువ అని.. ఆడవాళ్లకు ఎక్కువన్నారు. మహిళలు ఎక్కువ స్ట్రెస్ తీసుకుంటు-న్నార అన్నారు. ఎక్కడ రైస్ ఎక్కువ తింటారో అక్కడ డయాబెటిక్ ఉందన్నారు. వెనుకబడిన జిల్లాల్లో డయాబెటిక్ తక్కువగా ఉందని తెలిపారు. ఏపీలో మన్యం జిల్లాలో వ్యాధులు తక్కువగా ఉన్నాయని.. మంచి వాతావరణం,



సాంప్రదాయ ఆహారం అందుకు కారణమని చెప్పుకొచ్చారు. టాప్ టెన్ డిసీజెస్ కంట్రోల్‌కు ప్రపంచం ఏం చేస్తుందో చూశామన్నారు. ఇటీవలే ఏఐతో కూడిన న్యూట్రిషనల్ యాప్ తయారు చేశామని.. యాప్‌కు స్కోచ్ అవార్డు కూడా వచ్చిందని తలెపారు. ఇప్పటి వరకు 4 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకుని వినియోగిస్తున్నారన్నారు. పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్ దూరంగా ఉంటే మంచిదన్నారు. మిల్లెట్స్, బ్రౌన్ రైస్ ఎక్కువగా అలవాటు చేసుకోవాలని తెలిపారు. పంజాబ్ క్యాన్సర్ క్యాపిటల్ అయిందని.. దీని కౌంటర్ కోసం నేచురల్ ఫార్మింగ్ చేస్తున్నామన్నారు. ఫుడ్ యాజ్ ఏ మెడిసిన్.. కిచెన్ యాజ్ ఏ ఫార్మసీ అని.. దీని వల్ల ప్రభుత్వ బడ్జెట్ కూడా తగ్గుతుందన్నారు.

## అయిల్ కంపెనీలకు సర్కార్ షాక్..

**లీటర్‌కు రూ. 2 చొప్పున పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపు!**

హైదరాబాద్: పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంచింది కేంద్రం. పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రెండు రూపాయల చొప్పున పెంచారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ సుంకాన్ని పెంచుతూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని రూ.2 పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. పెరిగిన ధరలు ఇవాళ సోమవారం(ఏప్రిల్ 7) అర్ధరాత్రి 12 గంటల నుంచి అమల్లోకి వస్తాయి. అయితే ఎక్సైజ్ సుంకం ఆయిల్ కంపెనీలే భరిస్తాయని, పెట్రోల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సామాన్యుడిపై ఎలాంటి భారం ఉండదని తెలిపింది.దేశవ్యాప్తంగా అయిల్ కంపెనీలకు షాకిచ్చింది కేంద్ర సర్కార్. ప్రజలపై మళ్లీ పెట్రోల్ బాంబు పడింది. పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు రెండు రూపాయల చొప్పున పెంచారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలకు ఎక్సైజ్ సుంకాన్ని పెంచుతూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.2 పెంచింది. పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు సోమవారం(ఏప్రిల్ 7) అర్ధరాత్రి 12 గంటల నుంచి వర్తిస్తాయి. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం, భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన తరువాత కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

## మంగళగిరి ప్రజా సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకుంటాం

**మన ఇల్లు.. మన లోకేష్ కార్యక్రమం**
**ప్రారంభించిన మంత్రి లోకేష్**

అమరావతి, ఏప్రిల్7 : మంగళగిరి ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించే బాధ్యత తీసుకుంటానని మంత్రి లోకేష్‌కుమార్ అన్నారు. నారా లోకేష్ సోమవారం మంగళగిరి నియోజకవర్గంలో మూడో రోజు 'మన ఇల్లు... మన లోకేష్' కార్యక్రమాన్ని ప్రారం భించారు. మంగళగిరి నియోజ కవర్గానికి చెందిన కొలనుకొండ, ఉండవల్లి, ఇప్పటం గ్రామాలతోపాటు మంగళగిరి పద్మశాలిబజారుకు చెందిన మొత్తం 624 లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను మంత్రినారాలోకేష్ అందజేస్తున్నారు.ఈసందర్భంగామంత్రి మాట్లాడు తూ.. కుప్పం కంటే ఒక్క ఓటైనా ఎక్కువ వస్తుం దని చంద్రబాబుతో చేసిన ఛాలెంజ్ నిలబెట్టుకున్నానని అన్నారు. మంగళగిరి చేనేత సోదరులకు హ్యాండ్లూమ్ క్లస్టర్, స్వర్ణకారుల కోసం జేమ్స్ అండ్ జ్యువలరీ పార్క్ వస్తుందని, సులభ ఁంగా అయ్యే పట్టాలు ఈ ఏడాది ఇచ్చేస్తానని



మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. పడుతుందని, అటవీ, ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వడం చాలా కష్ట సాధ్యమని, అయినా మూడుసంవత్సరాల్లోపు ఇస్తామని మొత్తం 7వేల మంది దరఖాస్తు చేసుకుంటే.. అందులో 4,000 మంది ఒక మంగళగిరి నియోజకవర్గంలో ఉన్నారన్నారు. ఈ పట్టాన్ని రిజిస్టర్ చేసుకునే అవకాశం కూడా ఉందని రెండెళ్ల తర్వాత అమ్ముకునే హక్కుఎన్డీయేప్రభుత్వంకల్పిస్తుందన్నారు.మంగళగిరి నియోజవర్గాన్ని అభివృద్ధిలోకి తీసుకువెళతానని, ప్రజలు తనప ఉంచిన బాధ్యతను కచ్చితంగా నెరవేరుస్తానన్నారు. స్వచ్ఛందంగా సేవ చేసేందుకే కుటమి ప్రభుత్వం మీ ముందుకు వచ్చిందని, వెయ్యి కోట్ల రూపాయల ఆస్తిని ఒక రూపాయి అవినీతి లేకుండా ప్రజలకు ఇస్తున్నామని, మీకు ఏ సమస్య ఉన్న తమ ఇంటి తలుపు తట్టండి .24 గంటలుఅందుబాటులోఉంటానని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## వక్ఫ్ చట్టంపై సుప్రీం విచారణ..

**కీలక వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం**




ఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన వక్ఫ్ సవరణ బిల్లు-2025కి పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీనికి రాష్ట్రపతి ఆమోదం కూడా లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం తెలపడంతో ఇది చట్టంగా మారింది. ఈ బిల్లుపై లోక్‌సభలో సుమారు 14 గంటల పాటు సుదీర్ఘ చర్చ నడిచింది. అనంతరం సవరణల వారీగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా.. బిల్లుకు అనుకూలంగా 288 మంది.. వ్యతిరేకంగా 232 మంది లోక్‌సభ సభ్యులు ఓటేశారు. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన సవరణలు వీగిపోయాయి. ఎట్టకేలకు బిల్లు చట్టరూపం దాల్చింది.అయితే వక్ఫ్ బిల్లు చట్టరూపం దాల్చకముందే అనగా రాష్ట్రపతి ఆమోదం లభించకముందే.. పలువురు.. వక్ఫ్ బిల్లును సవాలు చేస్తూ.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఎదుట మెన్షనింగ్ చేశారు. ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్.. వీటిని మెన్షన్ చేశారు. అంతేకాక వీటిపై త్వరితగతిన విచారణ చేపట్టాలని కోరారు.వక్ఫ్ చట్టంపై సుప్రీకోర్టులో దాఖలైన పిటిషన్లపై సోమవారం నాడు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా కీలక వ్యాఖ్యలు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అటువంటి విషయాలను నిర్వహించడానికి దేశంలో ఒక వ్యవస్థ అమలులో ఉందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది.వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ముస్లిం పర్సనల్ లా బోర్డుతో పాటు పలు రాజకీయ పార్టీలు కూడా ఉన్నాయి. అయితే వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని.. తమ ప్రభుత్వం ఏ ఒక్కరి మత విశ్వాసాలను దెబ్బ తీయడం లేదని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

## మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరు: మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్: కేంద్రం హైదరాబాద్ మెట్రోకు నిధులు అడిగితే ఇవ్వట్లేదని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణాకు బిజెపి నేతలు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూసీ పునర్జీవానికి నిధులు అడిగితే రూపాయి ఇవ్వలేదని మండిపడ్డారు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్రమంత్రులు ఎప్పుడైనా మాట్లాడారా?నని ప్రశ్నించారు. మతతత్వ రాజకీయాలను తెలంగాణ ప్రజలు సహించరని తెలియజేశారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఆమోదించాలని కేంద్రాన్ని ఎందుకు అడగటం లేదని ధ్వజమెత్తారు. గుజరాత్ లో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వటం లేదా?నని మహేష్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు.



## వేసవి ఉష్ణోగ్రతలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07 – ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ రాము నాయక్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్ కుమార్, జిల్లా హాస్పటల్ సూపరిండెంట్ డాక్టర్ మల్లీశ్వరి, జిల్లా ఇన్చార్జి వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ డాక్టర్ లలిత, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, డిఎఫ్ఓ సమ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే ప్రక్రియను వెంటనే పూర్తి చేయండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07-గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన వర్క్ ఫ్రం హోం మిస్సింగ్ ఎంప్లాయిస్, సిటిజన్స్ తదితర చేపట్టిన సర్వేలు వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఎంపిడిఓ, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సర్వే ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన వర్క్ ఫ్రం హోం మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా సర్వేలపై పాలసీ విధానాన్ని రూపొందించాల్సి ఉంటుందని పెండింగ్లో ఉన్న సర్వేను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. జిల్లాలో ఇంకా 1,




27,813 మంది వర్క్ ఫ్రం హోం సంబంధించి పెండింగ్లో ఉందన్నారు. బేతంచెర్లలో 10 వేలు, నంద్యాల అర్బన్ లో 11,960 డోన్ లో 7,553 కొలిమిగుండ్లలో 6,981 కోయిలకుంట్లలో 5,684 ఆళ్లగడ్డ, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, అవుకు, పాణ్యం, సిరివెళ్ల, బనగానపల్లి తదితర మండలాలలో 4 వేలకు మించి వర్క్ ఫ్రం హోం ఎంప్లాయిస్ సర్వే పెండింగ్ ఉందని వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోఇంకాఎంప్లాయిస్, సిటిజన్స్ కు సంబంధించి 2,832 మంది పెండింగ్లో ఉందన్నారు. పెండింగ్ లో ఉన్న డేటాను వెంటనే పూర్తి చేసేలా డి ఎల్ డి ఓ లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

మంగళవారం 08-04-2025

## ట్రంప్ దూకుడుకు కళ్లెం పడేనా

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వానికి వ్యతిరేకంగా అమెరికావ్యాప్తంగా నిరసనలు భగ్గుమన్నాయి. మొత్తం 50 రాష్ట్రాల్లోని అనేక ప్రధాన నగరాల్లో ప్రజలు భారీ సంఖ్యలో ఉద్యమించారు. 'హ్యాండ్స్ ఆఫ్' పేరుతో ర్యాలీలు నిర్వహించి, ట్రంప్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతిపక్షానికి ఇది అతిపెద్ద నిరసన ప్రదర్శనగా మారింది. టారిఫ్ పేరుతో ప్రపంచ దేశాలను ట్రంప్ భయపెడుతున్న విషయం తెలిసిందే. అయితే, ట్రంప్ చర్యల వల్ల అమెరికాకి కూడా భారీ నష్టం వాటిల్లుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకునే ప్రమాదం కనిపిస్తోంది. ఇందుకు నిరసనగా పౌరహక్కుల సంఘాలు, కార్మిక సంఘాలు, ఎల్జీబీటీక్యూ మద్దతుదారులు, అనుభవజ్ఞులు, ఎన్నికల సంస్కరణ కార్యకర్తలు సహా 150కి పైగా సంస్థల మద్దతుతో మొత్తం 50 రాష్ట్రాల్లోని 1,200 ప్రాంతాల్లో ఈ హ్యాండ్స్ ఆఫ్ ర్యాలీలు జరిగాయి. అనేక చోట్ల ఇసుకేస్తే రాలనంత జనం కనిపించారు. కాగా నిరసనకారులు శాంతియుత ఆందోళనలు చేపట్టడంతో ఎలాంటి అరెస్టు జరగలేదు. ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపు, వలసలు, ఆర్థిక వ్యవస్థ, మానవ హక్కులు వంటి అంశాలపై డొనాల్డ్ ట్రంప్, బిలియనీర్ ఎలాన్ మస్క్లను విమర్శించడానికి నేషనల్ మాల్ అండ్ మిడ్టౌన్ మానహట్టన్ నుంచి బోస్టన్ కామన్, వివిధ రాష్ట్ర క్యాపిటల్స్ వరకు వేలాది మంది నిరసనకారులు అమెరికా అంతటా గుమిగూడారు. సియాటెల్లో నగరంలోని ప్రఖ్యాత స్పేస్ నీడిల్ సమీపంలో నిరసనకారులు "నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడండి" అనే నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ట్రంప్ సలహాదారు, టెస్లా, స్పేస్ఎక్స్, సోషల్ మీడియా ప్లాట్ఫామ్ ఎక్స్ అధిపతి ఎలాన్ మస్క్ కొత్తగా ఏర్పాటైన డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డీఓజీ) చీఫ్గా ప్రభుత్వ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తున్నారు. తన పని పన్ను చెల్లింపుదారులకు కోట్లాది రూపాయలు ఆదా చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కానీ ఆయన చర్యలతో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఇది చర్చకు దారితీసింది. నేషనల్ మాల్ ర్యాలీలో హ్యూమన్ రైట్స్ క్యాంపెయిన్ అధ్యక్షుడు కెల్లీ రాబిన్సన్ ఎల్జీబీటీక్యూ కమ్యూనిటీ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును విమర్శించారు. కాంగ్రెస్కు చెందిన పలువురు డెమొక్రటిక్ సభ్యులు కూడా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు."మనం చూస్తున్న దాడులు కేవలం రాజకీయమైనవి కావు – అవి వ్యక్తిగతమైనవి. వారు మా పుస్తకాలను నిషేధించడానికి, హెచ్ఐవి నివారణ నిధులను తగ్గించడానికి, మా వైద్యులు, మా ఉపాధ్యాయులు, మా కుటుంబాలు, మా జీవితాలను నేరపూరితం చేయడానికి ప్రయత్నిస్తున్నారు," అని కెల్లీ రాబిన్సన్ అన్నారు. లో నిరసనకారులు "ప్రజాస్వామ్యాన్ని నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)", "సామాజిక భద్రత నుంచి చేతులు తీయండి (హ్యాండ్స్ ఆఫ్)," వంటి బోర్డులను ప్రదర్శించారు. కొలంబస్లోని స్టేట్ హౌస్లో గుమిగూడిన వందలాది మందిలో ఒహాయోలోని డెలావేర్ కౌంటీకి చెందిన 66 ఏళ్ల రిటైర్డ్ రోజర్ బ్రూమ్ కూడా ఉన్నాడు. తాను ఒకప్పుడు రీగన్ రిపబ్లికన్గా గుర్తింపు తెచ్చుకున్నానని, కానీ ఆ తర్వాత ట్రంప్ పట్ల విరక్తి చెందానని చెప్పారు."ఆయన ఈ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నారు. ఇది కేవలం ఫిర్యాదుల పరిపాలన మాత్రమే," అని బ్రూమ్ అన్నారు. న్యూయార్క్ పెయింటర్ షైనా కెస్నర్ (43) మాన్హాటన్ నడిబొడ్డున కవాతు చేస్తున్న ఒక గుంపులో చేరి నిరసన తెలిపారు. "నేను చాలా కోపంగా ఉన్నాను. తెల్లజాతి రేపిస్టుల గుంపు మన దేశాన్ని శాసిస్తోంది. అది సరైనది కాదు," అని అన్నారు. ఫ్లోరిడాలోని జూపిటర్లో జరుగుతున్న సీనియర్ క్లబ్ చాంపియన్షిప్లో డొనాల్డ్ ట్రంప్ పాల్గొనగా పామ్ బీచ్ గార్డెన్స్లో వందలాది మంది నిరసనకారులు గుమిగూడి నిరసనలు తెలిపారు. అధ్యక్షుడు ట్రంప్ వైఖరి స్పష్టంగా ఉంది: అర్హులైన లబ్ధిదారులకు సామాజిక భద్రత, మెడికేర్ను ఆయన ఎల్లప్పుడూ పరిరక్షిస్తారు. ఇంతలో, డెమొక్రాట్ల వైఖరి అక్రమ విదేశీయులకు సామాజిక భద్రత, మెడికేర్ ప్రయోజనాలను ఇస్తోంది. ఇది ఈ కార్యక్రమాలను దివాళా తీస్తుంది. అమెరికన్ సీనియర్లను అణచివేస్తుంది," అని వైట్ హౌస్ చెప్పుకొచ్చింది. మరో వైపు ట్రంప్ టారిఫ్ల మోతకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. మరోవైపు అమెరికాలోనూ ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశం ఉందని ఆదేశ ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధరలు విపరీతంగా పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. టారిఫ్ ప్రభావంతో ఇరాన్ కరెన్సీ, ఇరానియన్ రియాల్ , మళ్లీ భారీ పతనాన్ని చవిచూసింది. ఒక అమెరికన్ డాలర్తో పోలిస్తే రియాల్ విలువ 10,43,000కి చేరుకుని చరిత్రలో అత్యంత కనిష్ఠ స్థాయిని తాకింది. ఈ సంక్షోభం నేపథ్యంలో రానున్న రోజుల్లో దీని విలువ ఎంతమేరకు తగ్గుతుందన్నది అనిశ్చితంగా మారింది. టెహ్రాన్లోని ఫెర్దౌసీ వీధి, దేశంలో కరెన్సీ మారక కేంద్రంగా ఉన్నప్పటికీ, అనేక మంది వ్యాపారులు నగదు బదిలీ వ్యాపారాన్ని నిలిపివేశారు. రియాల్ పతనం వల్ల ఇరాన్లో ద్రవ్యోల్బణం 40% దాటింది. ఆహార ధరలు కొన్ని సందర్భాల్లో 100% వరకు పెరిగాయి. సామాన్య ప్రజలు తమ ఆదాయాన్ని డాలర్లు, బంగారం వంటి సురక్షిత ఆస్తుల్లోకి మార్చడం వల్ల రియాల్పై ఒత్తిడి మరింత పెరుగుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆంక్షలు ఎత్తివేయకపోతే, ఈ సంక్షోభం తీవ్రతరమై ఆర్థిక స్థిరత్వం మరింత దెబ్బతింటుంది. ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉంది, లేకపోతే రాబోయే రోజుల్లో పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

## సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ..




విభారే న్యూస్ ఏప్రిల్ 7 ఎమ్మిగనూరు..స్థానిక సెయింట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం రోజు మూడవ సంవత్సరం బీటెక్ చదువుతున్న విద్యార్థులకు అభిజ్ఞత (ఆప్టిట్యూడ్) తర్కశక్తి (రీజనింగ్) లపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ప్రముఖ ట్రైనర్ కృష్ణచైతన్య రెడ్డి వంశీకృష్ణ రెడ్డి ల ఆధ్వర్యంలో నేడు ప్రారంభమైంది. ఈ శిక్షణ విద్యార్థులకు చివరి సంవత్సరంలో వచ్చే క్యాంపస్ నియామకాల్లో ఇతర పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ కె సుధాకర్ తెలియజేశారు. శిక్షణా కార్యక్రమంఆద్యంతం ప్రయోజనకరంగా ఉండేలా విశేషంగా ప్రణాళిక చేయబడింది. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్, ప్లేస్మెంట్స్ డీన్ హ్యాపీ డాక్టర్ పి రాజేంద్ర ప్రసాద్ మరియు ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన 120 ఫిర్యాదులను విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



విభారే న్యూస్ ఏప్రిల్ 7 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 120 ఫిర్యాదులు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరిత గతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ.కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు .జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 120 ఫిర్యాదులు వచ్చాయి.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ..1)రైల్వేలో డబల్ ట్రాక్ లైన్ వర్క్ చేయించడానికి సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు , జోహారాపురం కు చెందిన శ్రీనివాసులు రూ. 1 లక్ష 20 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూల్, కల్లూరు మండలం, చెంచునగర్ కు చెందిన పి. ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 2)అలీ కాటన్ మిల్ ఆదానికి చెందిన లయక్ అలీ, కుర్మ అలీ లు కలిసి పార్టనర్ షిప్ లో టెండర్ వేసి రూ. 2 కోట్ల 78 లక్షల కాటన్ ను ఆదోని చౌడయ్య, సన్స్ నుండి తీసుకొని డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదోనికి చెందిన చౌడయ్య సన్స్ ప్రొప్రయిటర్ వేణుగోపాల్ ఫిర్యాదు చేశారు. 3)హైదరాబాద్ విప్రో కంపెనీలో సాఫ్ట్ వేర్ డెవలపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు అబ్బాస్ నగర్ కు చెందిన మిర్జా విక్రం బేగ్ రూ. 3 లక్షల 80 వేలు తీసుకోని మోసం చేశాడని కర్నూలు మండలం, బి. తాండ్రపాడు కు చెందిన నూర్ భాషా ఫిర్యాదు చేశారు. 4) నకిలీ పత్రాలు సృష్టించి రెండు ఎకరాల పొలానికి మేమే వారసులనీ అంటూ మా పొలాన్ని అమ్మడానికి ప్రయత్నిస్తున్న వీకర్ సెక్షన్ కాలనీ కి చెందిన మల్లేశ్వరి, బేబీ, నాగేశ్వరమ్మల పై చర్యలు తీసుకోవాలని కర్నూల్ , కల్లూరు మండలం ఇందిరమ్మ కట్ట కాలనీ కి చెందిన ఎం. నాగరాజు ఫిర్యాదు చేశారు. 5) నేను పద్మావతి అనే మహిళ దగ్గర చీటీలు వేశాను. ఆమె భర్త వెంకటనాయుడు ప్లాట్లు ఇచ్చి లింక్ డాక్యుమెంట్లు ఇవ్వలేదు,డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూల్ ,ఎమ్మెస్ నగర్ కు చెందిన గవర్నమెంట్ హాస్పిటల్ రిటైర్డ్ హెడ్ నర్స్ బి. నాగమ్మ ఫిర్యాదు చేశారు. 6) పొలంలో సర్వేనెంబర్ రాళ్లు తీసేసి ,జొన్న పంటను నాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆలూరు మండలం ,హొళ్తి బెలగల్ గ్రామానికి చెందిన శివశంకర్ ఫిర్యాదు చేశారు. 7)80 వేలు అప్పు తీసుకున్నాము, వడ్డీలతో కలిపి 4 లక్షలు కట్టాము. తప్పుడు పత్రాలు సృష్టించి ఇంకా 16 లక్షలు కట్టాలని గవి గట్టు అయ్యప్ప ఇబ్బందులకు గురిచేస్తూ దౌర్జన్యం చేస్తున్నారని పెద్ద కడుబూరు మండలం, బసల దొడ్డి గ్రామానికి చెందిన లక్ష్మి ఫిర్యాదు చేశారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి,బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ హామీ ఇచ్చారు.ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా,సిఐలు శ్రీనివాస నాయక్,ఇబ్రహీం పాల్గొన్నారు.

## కోట్ల ఆస్తిని వదిలేసి.. సన్యాసం

గాంధీనగర్ ఏప్రిల్ 7, గుజరాత్ లోని నగరానికి చెందిన జైన్ బ్లాక్కు చెందిన నరేంద్ర గాంధీ, సంగీత గాంధీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో, ఇప్పుడు 26 ఏళ్ల కుమార్తె నికితా విలాసవంతమైన జీవితాన్ని వదులుకుని సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకుంది. నరేంద్ర గాంధీ ఒక కోటీశ్వరుడు. గొప్ప ధనవంతుడు. అయితే, ఇప్పుడు బిలియనీర్ కుమార్తె నికితా సిరి తన సంపదను వదులుకుంది. నికిత గత ఏడు సంవత్సరాలుగా సన్యాసి కావాలని కోరుకుంది. ఆమె కోరిక ఇప్పుడు నెరవేరింది.నికిత సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకోవడంతో, ఆమె బంధువులు యాద్గిర్లో గొప్ప ఊరేగింపు నిర్వహించారు. వివిధ సంగీత వాయిద్యాలతో ఊరేగింపు జరిగింది, మొత్తం జైన సమాజం అందులో పాల్గొంది. నికితా ఇకపై ఎలాంటి వస్తువులను ఉపయోగించనందున ఊరేగింపు సమయంలో ప్రజలకు కొత్త దుస్తులతో సహా వివిధ వస్తువులను విరాళంగా ఇచ్చింది. ప్రమాణాలు అంగీకరించిన తర్వాత, అత్యంత కష్టతరమైన మార్గాన్ని తీసుకోవాలి. బూట్లు ధరించకూడదు, రవాణా కోసం ఎటువంటి వాహనాలను ఉపయోగించకూడదు. మీరు ఒకే చోట రెండు రోజుల కంటే ఎక్కువ ఉండకూడదుతెల్లని, శుభ్రమైన బట్టలు ధరించాలి. రోజువారీ నడక జీవితాన్ని గడపాలి. సన్యాసం స్వీకరించిన తలవెంట్రుకలను బ్లేడు ఉపయోగించకుండా చేతితోనే గుండు చేయించుకుంటారు. నికితా ఇంత కష్టతరమైన జీవితాన్ని ఎంచుకుంది. నాన్న ధనవంతుడు అయినప్పటికీ, అవన్నీ వదిలేసుకుంది. తన కుటుంబాన్ని, బంధువులను విడిచిపెట్టి సన్యాసిగా మారడం గురించి మాట్లాడిన నికిత, "గురుకులవాసికి వెళ్లడం ఎంచుకున్నాను. చాలా కాలంగా, నా తండ్రితో సహా మొత్తం కుటుంబం నాకు కారు, బైక్తో సహా నేను అడిగినవన్నీ ఇచ్చింది.కానీ, "నాకు ఇప్పుడు అందులో ఏవీ వద్దు" అని నికిత పేర్కొంది. ఏడు సంవత్సరాల క్రితం, నేను ఈ జీవితం వద్దు అని నిర్ణయించుకున్నాను. అందుకే, నేను సన్యాసి కావాలని నిర్ణయించుకున్నాను.

## ముందస్తు పన్నుకు భారిగా తరలి వస్తున్న పట్టణ ప్రజలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07– నంద్యాల పట్టణంలో ముందస్తు పన్నులు చెల్లించుటకు పట్టణ ప్రజలు భారీగా తరలిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ప్రారంభం కాగా, ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించుటకు పట్టణ ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.. ఈ సారి కూడా ముందస్తుగా ఆస్తి పన్ను ఈ నెల లోపు చెల్లించిన పక్షంలో 5 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి . పన్నులకు ఐదు శాతం రాయితీ అనే అంశంపై మున్సిపల్ అధికారులు పట్టణంలో పబ్లిసిటీ చేయడం వల్లే భారిగా ప్రజలు తరలి వస్తున్నారని పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు .

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07 – జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నందు ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం జరిగింది. ఈసందర్భముగాడాక్టర్వెంకటరమణ మాట్లాడుతూ తల్లి మరియు నవజాత శిశువుల ఆరోగ్యం పై దృష్టి సారించి నివారించ దగిన మరణాలను అంతం చేయాలని మరియు మహిళల దీర్ఘ కాలిక శ్రేయస్సు కు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తల్లి మరియు పిల్లల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి 'ఆ యుష్మాన్ భారత్' మరియు 'జాతీయ ఆరోగ్య మిషన్' వంటి కార్యక్రమాల ద్వారా సిబ్బంది కృషి చేస్తున్నారని అన్నారు. గర్భిణి స్త్రీలకు పోషకాహారం, విశ్రాంతి, గర్భ ధారణ ప్రమాద సంకేతాలు మరియు గర్భ సమయము లో తీసుకొనవలసిన జాగ్రత్తల పై అవగాహన అందజేయడం జరుగుతుందన్నారు. రక్త హీనత్ ముక్తి భారత్ ద్వారా కౌమార దశలో ఉన్నవారికి మరియు గర్భిణి స్త్రీలలో రక్తహీనత నిర్ధారణ, చికిత్స వంటి సేవలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రోగ్రామ్ అధికారులు.వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్పెషల్ ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07 – నంద్యాల పట్టణం లో వివిద వార్డులలో స్పెషల్ ఆధార్ క్యాంప్ ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కమిషనర్ ఒ ప్రకటన విడుదల చేశారు . జనన ధృవీకరణ పత్రము ఉండి ఆధార్ కార్డు లేని వారికి, ఆధార్ కార్డు డాక్యుమెంట్ అప్డేట్ 08– తేదీ నుండి 11– తేదీ వరకు స్పెషల్ అదార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 0 6 సంవత్సరాల నిండిన వారికి . జనన ధృవీకరణ పత్రము ఉండి ఆధార్ కార్డు లేని వారు మొత్తం జిల్లాలోని 5152 మంది ఉండగా, అందుకు గాను ఆధార్ కార్డు నమోదు చేసుకొనుట కొరకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ క్యాంప్, నిర్వహించబడును. పట్టణములోని సచివాలయ సిబ్బంది తమ తమ సచివాలయ పరిదిలోని స్కూల్స్ లలో అంగన్ వాడి టీచర్లు, విద్యార్డులకు, ప్రజలందరికీ తెలియపరిచి ఈ అవకాశాన్ని వినియోగించుకొనవలసినది గా సూచించారు. ఈ ఆధార్ స్పెషల్ క్యాంపు సంబంధించి అందరూ వార్డు సచివాలయ సిబ్బంది ముఖ్యంగా వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రెటరీ, ఎడ్యుకేషన్ సెక్రెటరీ, వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా పోలీసులు, రెవిన్యూ సెక్రెటరీలు, ప్రజలందరికీ తెలపాలన్నారు.



# పిఠాపురంలో కూటమి కుమ్ములాటలు

కాకినాడ, ఏప్రిల్ 7, పిఠాపురం కూటమి పార్టీల్లో ఏం జరుగుతోంది? డిప్యూటీ సీఎం పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ నియోజకవర్గంలో టీడీపీ పట్టు తప్పుతోందా? అక్కడ సోలో పవర్‌గా ఎదగడానికి జనసేన స్కెచ్ గీస్తోందా? అంటే పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయి.. పవన్ కోసం టీడీపీ నేత వర్మ 2024 ఎన్నికల్లో తన సీటు త్యాగం చేసారు. ఆ సమయంలోనే ఎమ్మెల్సీ సీటు పైన హామీ దక్కింది. అయితే, పది నెలలు పూర్తయినా ఎమ్మెల్సీగా అవకాశం రాలేదు. ఇక జనసేన సభలో నాగబాబు చేసిన కామెంట్స్ వర్మ మద్దతు దారులు, టీడీపీ శ్రేణులకు ఆగ్రహం తెప్పించాయి..పిఠాపురంలో వర్మకు చెక్ పెడుతున్నారా? నాగబాబు ఎమ్మెల్సీ హోదాలో పిఠాపురంలో ఎంట్రీ ఇచ్చి హడావుడి చేస్తుండటంతో టీడీపీ కేడర్‌లో ఈ సందేహం మొదలైంది. నాగబాబు పిఠాపురంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అన్నా క్యాంటీన్ ను ప్రారంభించారు. పవన్ కోసం సీటు త్యాగం చేసిన వర్మకు ప్రాధాన్యత లేకుండా జనసేన నేతలు వ్యవహరిస్తున్న తీరు వర్మ టీడీపీ కేడర్ కు నచ్చటం లేదంట. దీంతో, పార్టీకి అనుకూలంగా కాకుండా జై వర్మ అంటూ స్లోగన్స్ ఇచ్చారు. నాగబాబు పర్యటన సమయంలో వర్మ మద్దతు దారుల నినాదాలకు కౌంటర్‌గా జనసేన కేడర్ జై జనసేన అంటూ నినాదాలు చేసారు. పిఠాపురం కేంద్రంగా రోజు రోజుకీ ముదురుతున్న ఈ వివాదం ఇప్పుడు రెండు పార్టీల శ్రేణులకు అంతు పట్టకుండా తయారైందంట.ఇటీవల పిఠాపురంలో జనసేన ప్లీనరీ వేదికగా నాగబాబు చేసిన వ్యాఖ్యలతో రెండు పార్టీ శ్రేణుల మధ్య గ్యాప్ మరింత పెరిగింది. వర్మకు ఎమ్మెల్సీ ఇవ్వకుండా పవన్ సోదరుడు నాగబాబుకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వటం.. మంత్రిగానూ ఛాన్స్ ఇవ్వాలని నిర్ణయించటం టీడీపీ కేడర్ కు ఆగ్రహం తెప్పిస్తోంది. పిఠాపురంలో పవన్ గెలుపులో వర్మ కీలక పాత్ర పోషించారు.ఎన్నికల తరువాత క్రమేణా వర్మ ? జనసేన శ్రేణుల మధ్య గ్యాప్ పెరుగుతోంది. స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. జనసేన ప్లీనరీ వేదికగా నాగబాబు ఎవరైనా పవన్ విజయం వెనుక ఉన్నామని భ్రమ పడితే అది వారి ఖర్మ అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పైన టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.ఇటీవల పిఠాపురం జనసేన నియోజకవర్గ ఇంఛార్జ్‌తో టీడీపీ శ్రేణులు వాగ్వాదానికి దిగారు. వర్మకు ప్రాధాన్యత ఇవ్వకపోవటంపైన నిలదీసిన కార్యకర్తలు.. వర్మ చెబితేనే పవన్‌కు ఓటు వేసామని తేల్చి చెప్పారు. ఆ క్రమంలో వర్మ ను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలంటూ స్థానికులు కోరుతున్న విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఎమ్మెల్సీ హోదాలో నాగబాబు రెండు రోజుల పాటు పిఠాపురంలో పర్యటనకు వచ్చారు. నియోజకవర్గం పెత్తనం తన సోదరుడు చేతిలో పెట్టేలా పవన్ డిసైడ్ అయినట్లు చెబుతున్నారు.ఇక నుంచి పిఠాపురం బాధ్యతలు నాగబాబు చూస్తారని జనసేన వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఆ సెగ్మెంట్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నూతన నిర్మాణాలను నాగబాబు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నారు. త్వరలోనే నాగబాబు మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. నాగబాబు ఎంట్రీతో నియోజకవర్గంలో రెండు పార్టీల కేడర్ మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపించింది. జనసైనికులు పార్టీ నినాదాలతో హోరెత్తిస్తే, టీడీపీ శ్రేణులు వర్మ అనుకూల నినాదాలతో మోత మోగిస్తున్నాయి. ఆ క్రమంలో పిఠాపురం కేంద్రంగా వర్మ లక్ష్యంగా చోటు చేసుకునే రాజకీయంగా పై ఉత్కంఠ కొనసాగుతోంది.అలజడి జరిగింది నాగబాబు పర్యటనలోనే అయినా, టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది మాత్రం ఆయన కాదు. అయితే ఫిర్యాదు చేసిన జనసేన నేత పేరు కూడా నాగబాబే కావడంతో అత్యుత్సాహంతో కథనాలు వండి వారుస్తోంది. టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు అందింది వాస్తవమే, అయితే ఫిర్యాదు చేసింది ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కాదు, మొయిళ్ల నాగబాబు. ఆయన కూడా జనసేన నాయకుడే. ఆయన ఎవరిపై కేసు పెట్టారనేదే ఇప్పుడు అసలు ప్రశ్న. ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు టీడీపీ నేతలేనా, లేక పసుకు కండువాల ముసుగులో ఉన్న అల్లరి మూకలా..? పోలీస్ విచారణలో తేలాల్సి ఉందినాగబాబు పిఠాపురం పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన ప్రత్యేకంగా సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కి ధన్యవాదాలు చెబుతూ ఓ ప్రెస్ నోట్ విడుదల చేశారు. తన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు స్థానిక జనసేన నేతలకు కూడా థ్యాంక్స్ చెప్పారు. అయితే టీడీపీ నేతలు రచ్చ చేయడంపై ఆయన ఎక్కడా పెదవి విప్పలేదు. నాగబాబు పిఠాపురం పర్యటనలో తనను అడ్డుకుని మోటార్ సైకిల్ అద్దాలు పగలగొట్టారని జనసేన నేత మొయిళ్ల నాగబాబు పోలీసులకు ఫిర్యాదు చేయడం విశేషం. తన విధులకు ఆటంకం కలిగించారంటూ పిఠాపురం అడిషనల్ ఎస్సై జానీ భాషా కూడా మరో ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై గొల్లప్రోలు పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేయడం విశేషం.పిఠాపురం వ్యవహారం రెండు పార్టీల అధిష్టానాల వద్దకు వెళ్లింది. ప్రస్తుతానికి ఈ వ్యవహారంపై అధినేతలిద్దరూ సైలెంట్ గానే ఉన్నారు. నాగబాబు తొలి పర్యటనే ఇలా జరగడంతో అటు జనసేన నేతలు కూడా గుర్రుగా ఉన్నారు. పిఠాపురంలో జనసేనకు పక్కలో బల్లెంలా మారేందుకు టీడీపీ నేత వర్మ శక్తి వంచన లేకుండా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ పదవి వచ్చి ఉంటే వర్మ సైలెంట్ గా ఉండేవారు. కానీ అటు సీటు త్యాగం చేసి, ఇటు పదవి రాకపోవడంతో ఆయన హర్ట్ అయ్యారు. దీంతో పిఠాపురం కాస్త హాట్ సీట్ గా మారింది.

# వైసీపీ సీఎంగా.. భారతి



విజయవాడ, ఏప్రిల్ 7, వైసీపీ అధినేత జగన్ కు పెద్ద సమస్య వచ్చిపడిందంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేసే అవకాశం ఉండకపోవచ్చని అంటున్నారు. ముఖ్యంగా న్యాయవాది, వైఎస్ రాజశేఖర్ రెడ్డికి సన్నిహితుడిగా ముద్రపడిన ఉండవల్లి అరుణ్ కుమార్ ఇదే రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎందుకంటే జగన్ పై ఉన్న కేసులు తుది దశకు చేరుకున్నాయి. వీటితో పాటు కొత్త కేసులు కూడా మెడకు చుట్టుకునే అవకాశముంది. 2014 కు ముందు నమోదయిన క్విడ్ ప్రోకో కేసుల్లో ఇంకా తీర్పు వెలువడలేదు. దీంతో పాటు తాజాగా మద్యం కేసు కూడా మెడకు చుట్టుకునే అవకాశముందన్నది ఉండవల్లి అరుణ్ కుమార్ అభిప్రాయంగా ఉంది. క్విడ్ ప్రోకో కేసులో జగన్ కు శిక్షపడితే ఇక 2029 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదని ఆయన చెబుతున్నారు.ప్రస్తుతం బీజేపీతో సయోధ్యగా కొనసాగిస్తున్నప్పటికీ టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ లు కూడా మోదీ సర్కార్ పై వత్తిడి తెచ్చే అవకాశముంది. ఎందుకంటే గత ఎన్నికలలోనే జగన్ కు నలభై శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పటి వరకూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు పర్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై కొంత ప్రజల్లో అసహనం, అసంతృప్తి ఉంది. రానున్న నాలుగేళ్లలో సూపర్ సిక్స్ హామీలు చేసినా సహజంగా అధికారంలో ఉండే ప్రభుత్వ వ్యతిరేకత కొంత మూడు పార్టీలకు ఇబ్బందికరంగా మారుతుంది. జగన్ మాత్రం వచ్చే ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తారు. ఎవరితోనూ పొత్తుకు వెళ్లరు. ఈ విషయంలో మరో అనుమానానికి తావులేదుప్రస్తుతం కూటమిలో ఉన్న మూడు పార్టీలు కలసి పోటీ చేసినా ఏమాత్రం తేడా కొట్టినా ఓట్ల శాతం మారితే సీట్లు కూడా గల్లంతవుతాయి. అందుకే జగన్ పోటీ చేసే అవకాశం కోల్పోతే వైసీపీ నేతలు మానసికంగా సగం అపజయం పాలయినట్లేనన్న లెక్కలో ఉన్నారు. అదే సమయంలో ప్రజలు కూడా జగన్ కాకుంటే మరొకరు ఎవరికైనా ఇంతటి హైప్ లభించే అవకాశం ఉండకపోవచ్చన్న అంచనాలున్నాయి. అందుకే వైఎస్ జగన్ పై గత కొన్నేళ్లుగా కొనసాగుతున్న క్విడ్ ప్రోకో కేసులలో కనీసం రెండు మూడేళ్లు శిక్షను విధించినా పోటీ చేయడానికి అనర్హత వేటు పడే అవకాశముందని కూడా ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. ఇప్పటికే ఈ కేసుల విచారణ లో వేగం పుంజుకుందిఈ నేపథ్యంలోనే ఏ మాత్రం జైలుశిక్ష పడితే ఇక జగన్ కు 2029 ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముండదన్నది ఉండవల్లి అరుణ్ కుమార్ విశ్లేషణగా ఒక టీవీ ఛానెల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూను బట్టి తెలుస్తోంది. అప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో వైఎస్ భారతిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాల్సి ఉంటుంది. జగన్ ను కట్టడి చేయాలన్నా, వైసీపీ నుంచి ముప్పు తప్పించుకోవాలనుకున్నా జగన్ కు శిక్షపడటం ఒక్కటే మార్గం. శిక్షపడితే ఎవరూ ఏమీ చేయకుండానే జగన్ పార్టీ సులువుగా దెబ్బతినే అవకాశాలున్నాయి. అందుకే ఈ విషయం తెలిసిన కొందరు సీనియర్ నేతలు, జగన్ కు సన్నిహితంగా ఉన్న లీడర్లతో పాటు బంధువులు కూడా పార్టీని వీడి వెళ్లారంటున్నారు. అయితే అది న్యాయస్థానంలో ఉండటంతో మరి జగన్ విషయంలో జరుగుతున్న ఈ ప్రచారం ఎంత వరకూ నిజమవుతుందన్నది చూడాలి.

# ఆక్వారంగం.... సాయం కోసం ఎదురు చూపులు

ఏలూరు, ఏప్రిల్ 7, అమెరికా సుంకాల కారణంగా నష్టపోతున్న ఆక్వా రంగానికి అండగా ఏపీ సీఎం చంద్రబాబు రంగంలోకి దిగారు. రైతుల పరిస్థితిని వివరిస్తూ కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు చంద్రబాబు లేఖ రాశారు. ట్రంప్ విధిస్తున్న అడ్డగోలు సుంకాల నుంచి ఆక్వా ఉత్పత్తులు మినహాయింపు పొందేలా ప్రయత్నాలు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ను కోరారు ముఖ్యమంత్రి చంద్రబాబు.రాష్ట్ర జీడీపీలో ఆక్వా రంగం కీలకమైన భూమిక పోషిస్తోందని, సంక్షోభ సమయంలో ఆక్వా రైతులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. భారత దేశం నుంచి వెళ్లే సముద్ర ఆహార ఎగుమతులపై అమెరికా 27శాతం దిగుమతి సుంకం విధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అమెరికాకు 2.55 బిలియన్ డాలర్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. వీటిలో రొయ్యలే 92శాతం వాటాను కలిగున్నాయి. అమెరికా దేశానికి రొయ్యల ఎగుమతిలో కీలకమైన భారత దేశంపై 27శాతం దిగుమతి సుంకం కారణంగా ఆక్వా రైతాంగం నష్టపోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖలో ప్రస్తావించారు.ఇక ఈక్వెడార్ వంటి ఎగుమతిదారులపై కేవలం 10శాతం సుంకమే విధించింది అమెరికా. ఇది మన దేశానికి పరోక్షంగా నష్టం చేస్తూ వారికి అనుకూలంగా మారుతుందన్నారు. దీనికి తోడు మన దేశ ఎగుమతిదారులు ఇప్పటికే 5.77 శాతం కౌంటర్ రెయిలింగ్ డ్యూటీ భారాన్ని మోస్తున్నారు. అన్ని సుంకాలను కలుపుకుంటే ఈక్వెడార్, భారత్ దేశానికి మధ్య సుంకాల వ్యత్యాసం దాదాపు 20శాతం ఉంటుంది.అమెరికా విధించిన కొత్త సుంకం ఏప్రిల్ 5 నుంచి అమల్లోకి వచ్చింది. దీని కారణంగా అమెరికా వెళ్లే అన్ని ఎగుమతులపైన ఈ భారం పడుతుందని అభిప్రాయపడ్డారు చంద్రబాబు. గతంలో వచ్చిన ఆర్డర్స్ కు అనుగుణంగా ఇప్పటికే సేకరించిన ఉత్పత్తులు ప్యాకింగ్ చేయబడి కోల్డ్ స్టోరేజ్ పోట్లలో ఉన్నాయి. కొత్త నిబంధనల వల్ల ఈ ఉత్పత్తులపై సుంకాల భారం పడుతుంది.యూరోపియన్ యూనియన్ లో భారతీయ ఎగుమతిదారులు 50శాతం తనిఖీ రేట్లు, 4 నుంచి 7 శాతం దిగుమతి సుంకంతో సహా నాన్ టారిఫ్ అడ్డంకులు ఎదుర్కొంటున్నారు. కానీ వియత్నం వంటి దేశాలు యూరోపియన్ యూనియన్ తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ కింద జీరో డ్యూటీ పొందాయి. ఈ కారణంగా వియత్నాం వంటి దేశాలు యూరోపియన్ మార్కెట్ ను ఆక్రమిస్తున్నాయని తెలిపారు చంద్రబాబు.ఇక వియత్నాం, థాయిలాండ్, జపాన్ దేశాల మార్కెట్లు భారత్ నుంచి సీ ఫుడ్స్ కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి అమెరికాకు ఎగుమతి చేస్తాయి. అయితే, ఇప్పుడు అంతిమ ఉత్పత్తులపై విధించిన అధిక ట్యాక్స్ ల కారణంగా ఆ దేశాలు కూడా మనకిచ్చిన ఆర్డర్స్ ను రద్దు చేసుకున్నాయి. ఏపీలో కోల్డ్ స్టోరేజ్ లు కూడా నిండిపోవడంతో చేతికి వచ్చిన ఆక్వా పంటను ఎక్కడ ఉంచాలో కూడా తెలియడం లేదని గందరగోళమైన పరిస్థితిలో రైతాంగం ఉందని తెలిపారు. మరోవైపు 27శాతం సుంకాల కారణంగా రైతుల నుంచి పంట సేకరించడాన్ని ఎగుమతిదారులు నిలిపేశారు. ఈ పరిణామాలు రాష్ట్ర ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయన్నారు చంద్రబాబు

# పవన్ అలా ముందుకు...



విజయవాడ, ఏప్రిల్ 7, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు బాటలు మెరుగుపర్చుకుంటున్నారు. అన్ని సామాజికవర్గాలను కలుపుకుని వెళుతూ తన లక్ష్యాన్ని ఆయన నిర్దేశించుకున్నట్లే కనపడుతుంది. తనకు ఇంతటి విజయాన్ని అందించిన కాపు సామాజికవర్గంతో పాటు అభిమానుల ఆశలు నీరుగార్చకుండా కొంత ఆలస్యమయినా అనుకున్న టార్గెట్ ను రీచ్ అవ్వడానికి ఒక మార్గాన్ని రూపొందించుకుంటున్నారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఇటు కాపు సామాజికవర్గం, అటు కమ్మ సామాజికవర్గంతో పాటు బీసీ ఓటర్లతో పాటు అన్ని వర్గాలను తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు పవన్ కల్యాణ్ చేస్తున్నట్లే కనిపిస్తుంది.ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి ఫుల్లు సపోర్టు పవన్ కల్యాణ్ కు ఉంది. మోదీ నుంచి కింది స్థాయి నేతల వరకూ పవన్ కల్యాణ్ ను అభిమానిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తక్కువ సార్లు ఢిల్లీకి వెళుతూ వారితో సత్సంబంధాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ ఫ్యూచర్ లో తనకు అండగా నిలబడేందుకు అన్ని రకాలుగా ఒక్కొక్క మెట్టును పేర్చుకుపోతున్నారు. బీజేపీ కూడా పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలని గట్టిగా అనుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాదు. ఇప్పుడు కాకుండా అవసరమైన సమయంలో పవన్ ను సీఎం పదవి ఎక్కించాలన్న ఉద్దేశ్యంతో కమలనాథులున్నారు.పవన్ కల్యాణ్ కూడా నిదానంగా మెట్లను పేర్చుకుపోతున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు అందరి మనిషిలా కనిపిస్తున్నారు. ఇటు తెలుగుదేశం పార్టీ క్యాడర్ తో పాటు మిగిలిన సామాజికవర్గాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఫ్యూచర్ సీఎంగా అడుగులు వేస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఒకవైపు హిందుత్వాన్ని భుజానకెత్తుకున్నారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్ అటు బీజేపీ మనసును దోచుకోవడమే కాకుండా ఇటు హిందుత్వ నినాదాన్ని అందుకుని తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నా ఆయన గోల్ మాత్రం ముఖ్యమంత్రి పదవి అనేలా వ్యవహార శైలి కనిపిస్తుంది. తాజాగా భద్రాచలం రామయ్య కల్యాణానికి హాజరు కావడం కూడా అందులో భాగమేనంటున్నారు. కమ్మ సామాజికవర్గం కూడా చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ ను మాత్రమే ముఖ్యమంత్రిగా కోరుకుంటారు. జగన్ ను ఎట్టిపరిస్థితుల్లో వారు అంగీకరించే పరిస్థితి ఉండదు. ఆర్థికంగా, సామాజికపరంగా, ఎన్ఆర్ఐల నుంచి పారిశ్రామికవేత్తలు, సినీ పెద్దల వరకూ చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ కు ముఖ్యమంత్రి పదవి రావాలని కోరుకుంటారు. ఇక ఇటు కాపు సామాజికవర్గం, అటు అభిమానుల బలమైన కోరిక పవన్ సీఎం కావడమే. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గిరిజనులు, దళితులు, బలహీనవర్గాల ప్రతినిధిగా పవన్ కల్యాణ్ తనను తాను మలచుకుంటూ పోతున్నారు. అయితే సుదీర్ఘ కాలం పాటు వేచి చూసైనా పవన్ కల్యాణ్ తన గోల్ ను చేరే అవకాశాలు మాత్రం లేకపోలేదు.

# ప్రవీణ్ కేసు..కొత్త మలుపులు..

రాజమండ్రి, విజయవాడ, ఏప్రిల్ 7,పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం విషయంలో క్రమక్రమంగా మీడియా, సోషల్ మీడియా హడావిడి కాస్త తగ్గింది. ఆందోళనకారులు కూడా కాస్త చల్లబడ్డారు. అయితే అప్పటికే జరగాల్సిందందా జరిగిపోయింది. సోషల్ మీడియాలో ఎవరికివారు విశ్లేషకులైపోయారు. అది ప్రమాదం కాదు, హత్యేనంటూ తీర్మానించేశారు. ఆ హత్య ఎలా జరిగిందో కూడా వివరిస్తున్నట్టుగా మాట్లాడారు. ప్రవీణ్ పగడాల సీసీ టీవీ ఫుటేజీలు బయటకొచ్చేంత వరకు మీడియా, సోషల్ మీడియాలో అది ప్రమాదం కాదు, హత్యేనంటూ హోరెత్తిపోయింది. కానీ సీసీ టీవీ ఫుటేజీలు బయటపడిన తర్వాత ఈ కేసులో చిక్కుముడులు ఒక్కొక్కటే వీడుతున్నాయి. పోలీస్ విచారణపై తమకు నమ్మకం ఉందని ఎక్కువగా స్పందించవద్దని కుటుంబ సభ్యులే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు వరుస కేసులు నమోదవడం విశేషంప్రవీణ్ పగడాల మరణం తర్వాత సోషల్ మీడియాలో హేట్ స్పీచ్ వైరల్ గా మారింది. కొంతమంది తీవ్రంగా స్పందించారు. మతాలను మధ్యలోకి తీసుకొచ్చారు. గతంలో వార్నింగ్ లు ఇచ్చినవారే ఇప్పుడు చంపేసి ఉంటారని అనుమానించారు. సీసీ టీవీ ఫుటేజీలు బయటకొచ్చిన తర్వాత కూడా ఇది ముమ్మాటికీ హత్యనంటూ మాజీ ఎంపీ హర్షకుమార్ చేసిన వ్యాఖ్యల్ని పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అది హత్యే అయితే అందుకు మీ దగ్గరున్న ఆధారాలు చూపండి అంటూ నోటీసులిచ్చారు. హర్షకుమార్ కూడా తగ్గేది లేదన్నారు. అసలు అది హత్య కాదంటూ మీ దగ్గర ఉన్న ఆధారేంటో చూపెట్టాలన్నారు. తాను రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా వివరాలు రాబడతానని చెబుతున్నారు.హర్షకుమార్ సంగతి పక్కనపెడితే.. క్రిస్టియన్ సామాజిక వర్గం నుంచి కూడా కొంతమంది పాస్టర్లు, ఇతర సంఘాల నేతలు ప్రవీణ్ పగడాల మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. సోషల్ మీడియాలో వీడియోలను పోస్ట్ చేశారు. ఈ ఆరోపణలన్నిటినీ పోలీసులు నిశితంగా గమనించారు. అసత్య ప్రచారం చేయొద్దని, మత విద్వేషాలు రెచ్చగొట్టొద్దని గతంలోనే పోలీసులు విజ్ఞప్తి చేశారు. అయినా కూడా కొంతమంది మరింత దూకుడుగా వ్యవహరించారు. అప్పటికప్పుడు పోలీసులు సంయమనం పాటించారు. ప్రవీణ్ పగడాల మృతిపై ఆందోళనలు కాస్త సద్దుమణిగిన తర్వాత ఆరోపణలు చేసిన వారిపై దృష్టి పెట్టారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన వారిపై కూడా వారు ఫోకస్ పెంచారు. వారందరికీ ఇప్పుడు నోటీసులిస్తున్నారు. ఆయన మృతి విషయంలో ఏమైనా కొత్త విషయాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలంటున్నారు. అదే సమయంలో మరింత దూకుడుగా వ్యవహరించి, తీవ్రమైన వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీసులు కేసులు పెట్టారుప్రవీణ్ మరణంపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తూ, ప్రజల్ని రెచ్చగొడుతున్నారనే ఆరోపణలపై తాజాగా ఇద్దరిపై కేసులు పెట్టారు పోలీసులు.

# గర్భం కాని గర్భం...

## 9 నెలల తర్వాత అసలు రహస్యం

రాజమండ్రి, ఏప్రిల్ 7,అమ్మా.. అనే పిలుపు మహిళల జీవితంలో ఎంతో అమూల్యమైనది. అమ్మతనంతోనే తమ జీవితం పరిపూర్ణమవుతుందని ఎంతో మంది మహిళలు నమ్ముతారు. అయితే, ప్రస్తుతమున్న కాలంలో అమ్మతనం అనేది చాలా మంది మహిళలకు అంత సులువుగా దొరకట్లేదు. సంతానలేమి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పెళ్లైన ఎన్నో జంటలు సంతానం కోసం ఏళ్లపాటు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇదే పరిస్థితి ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలానికి చెందిన ఓ మహిళకు ఎదురైంది. పెండ్లి జరిగి ఏళ్లు గడుస్తున్నా గర్భం దాల్చకపోవటంతో ఇరుగుపొరుగులు, ఇంట్లోవాళ్ల మాటలు భరించలేక ఆ మహిళ ఎవ్వరూ ఊహించని సాహసానికి ఒడిగట్టింది. దీంతో తొమ్మిది నెలలు మానసిక యాతన అనుభవించింది.దేవీపట్నం మండలంకు చెందిన జంటకు పెళ్లి జరిగి తొమ్మిదేళ్లు అయినా సంతానం కలగలేదు. దీంతో మహిళ సంతానలేమి కారణంగా సూటిపోటి మాటలు ఎదర్కోక తప్పలేదు. వారి మాటలను భరించలేక పోయిన మహిళ గర్భం దాల్చానంటూ అందరినీ నమ్మించింది. ప్రతినెలా భర్తతో కలిసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లేంది. భర్తను బయటే ఉంచి వైద్యురాలి వద్దకు వెళ్లేది. గర్భం దాల్చడానికి తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి మాట్లాడి వెళ్లిపోతుండేది. భర్తకు, అత్తింటిలోని వారికి మాత్రం వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు చెప్పేది.నెలలు గడుస్తుండటంతో గర్భిణిలా కనిపించేందుకు చీర లోపల ఒత్తుగా దుస్తులు అమర్చుకునేది. తొమ్మిది నెలలు నిండడంతో ఈనెల 3న భర్త, అత్తతో కలిసి రాజమహేంద్రవరం ఆసుపత్రికి ప్రసవం కోసమని వెళ్లింది. అక్కడ ఏం చేయాలో ఆమెకు పాలుపోలేదు. దీంతో ఆ మహిళ మరో కొత్త ప్లాన్ వేసింది. ఆస్పత్రి వద్దకు వెళ్లాక వెంటనే వస్తానని చెప్పి భర్త, అత్తకు దూరంగా వెళ్లింది. ఎంతసేపటికి భార్య రాకపోవటంతో ఆస్పత్రి వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో భర్త, అతని తల్లి వెతికారు. ఆచూకీ దొరక్కపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# విశాఖ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

విశాఖపట్నం,అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విశాఖ విమానాశ్రాయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా డుంబ్రిగూడ మండలం, పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామానికి బయలుదేరారు. గిరిజన గ్రామాల అభివృద్ధి నిమిత్తం చేస్తూనే "అడవి తల్లి బాట" కార్యక్రమానికి పెదపాడు గ్రామంలో అయన శ్రీకారం చుడతారు. అంతకు ముందు విమానాశ్రయంలో విశాఖ జిల్లా కలెక్టర్ శ్రీ ఎం.ఎన్.హరేంద్రప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు, యలమంచిలి శాసన సభ్యులు సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పోరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు, ప్రధాన కార్యదర్శి శ్రీ బొలిశెట్టి సత్యనారాయణ, పార్టీ నేతలు డాక్టర్ సందీప్ పంచకర్ల, పసుపులేటి ఉషాకిరణ్, బోడపాటి శివదత్, భీశెట్టి వసంత లక్ష్మి తదితరులు ఘన స్వాగతం పలికారు

## టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్ ను అభినందించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



విభారే న్యూస్ కర్నూలు,ప్రతినిధి. ఏప్రిల్ 07:- మార్చి 20 నుండి 23 వరకు అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ టెన్నిస్ క్రీడలలో పాల్గొని రెండు బంగారు పతకాలు సాధించిన ఇండియన్ డెఫ్ టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్ ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అభినందించారు.. జాతీయ టెన్నిస్ మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో బంగారు పతకాలు సాధించిన టెన్నిస్ క్రీడాకారిణి షేక్ జఫ్రీన్ ను సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లు అభినందించి సన్మానం చేశారు ..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ షేక్ జఫ్రీన్ మార్చి 20 నుండి 23 వరకు అహ్మదాబాద్‌లో జరిగిన జాతీయ క్రీడలలో పాల్గొని మహిళల సింగిల్స్ విభాగంలో బంగారు పతకం సాధించారని, అదే విధంగా నంద్యాలకు చెందిన సాయి చందన్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకం సాధించడం అభినందించాల్సిన విషయమన్నారు... తద్వారా 2025 నవంబర్ నెలలో జపాన్‌లో జరగనున్న బధిరుల ఒలింపిక్స్‌లో పాల్గొనడానికి ఆమె అర్హత సాధించారని, భవిష్యత్తులో మరింత ప్రతిభ చూపి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డి ఆర్ ఓ సి. వెంకటనారాయణమ్మ, డిసిఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## జిమ్ కేర్ కామినేని హాస్పిటల్ లో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




విభారే న్యూస్ కర్నూల్ ప్రతినిధి ఏప్రిల్ 7. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ, జిమ్ కేర్ కామినేని హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ ల సంయుక్త ఆధ్వర్యంలో జిమ్ కేర్ కామినేని వైద్యశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరిం చుకొని తొలి దశలో వ్యాధిని గుర్తించడం- ఆరోగ్య నియమాలు పాటించడం- దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశంపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా న్యాయ సవాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి శ్రీ బి .లీల వెంకట శేషాద్రి గారి ఆదేశాల మేరకు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు .ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి శ్రీ బి .లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ఏది సాధించాలన్న ఆరోగ్యంగా జీవించడం చాలా ముఖ్యమైనది అన్నారు. జిమ్ కేర్ కామినేని వైద్యులు సీ.ఈఓ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు .లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యాధులను తొలి దశలో గుర్తించగలిగితే చికిత్స సులభతరం అవ్వడమే కాకుండా పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం వైద్యులు వ్యాధుల లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూల్ మెల్విన్ జోన్స్ సభ్యులు పవన్, గోపీనాథ్, మురళి శంకరప్ప, రామకృష్ణ, ఎల్ల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పరిహాసంలా పారిశుధ్యం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07- పట్టణం లో బాలాజీ కాంప్లెక్స్ షోలే ట్రావెల్సు వద్ద ఉన్న మురుగు కాలు వలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థా లు పేరుకుపోయి వర్షపునీరు దారిపైకొన్తుం టుంది. మున్సిపల్ పైప్ లైన్ ఏ మాత్రం లీక్ ఉన్న మంచి నీరు కలుషితం అవుతుంది.. మున్సిపల్ శానిటేషన్ సూపరైజర్ మురళీధర్ సమస్యను పరిష్కరిస్తామన్నారు

## గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ ని కోరిన ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజు





కర్నూలు కలెక్టరేట్ :విభారే న్యూస్. ఏప్రిల్ 7 కర్నూలు జిల్లాలోని వివిధ గ్రామంలో నివాసం ఉంటున్న గిరిజనుల యొక్క సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ రంజిత్ భాష కలిసి వినతి పత్రం అందజేశారు ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన ఎరుకల రాజు మాట్లాడుతూ పడమటి ప్రాంతం కౌతాళం. మంత్రాలయం. ఎమ్మిగనూరు ప్రాంతాల్లో ఎక్కువగా గిరిజనలు ఉన్నారు అలాంటి నియోజవర్గాలకి ఒక ఉన్నత స్థాయి అధికారిని నియమించి తక్షణమే గిరిజనుల యొక్క సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఎరుకల హరి, తదితరులు పాల్గొన్నారు

## మున్సిపాలిటీలో అవినీతిని అక్రమాలను అరికట్టండి: ఎస్ డి పి ఐ నాయకుల డిమాండ్




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07-నంద్యాల మున్సిపాలిటీలోని కొంతమంది అవినీతి అధికారుల, సిబ్బంది అవినీతి అక్రమ ఆరోపణలపై వెంటనే విచారణ జరిపి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సోమ వారం నాడు సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ నాయకులు సాయిబాబా నగర్ ఆర్చ్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు ఎజాస్ హుసేన్. ప్రదాన కార్యదర్శి కరిముల్లా. అబ్దుల్ కలాం మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటీని ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ మరియు కొంతమంది అవినీతి సిబ్బంది కలిసి భ్రష్టు పట్టిస్తున్నారని , ఏ ఫైలు ముందుకు వెళ్లాలన్నా ఏ డాక్యుమెంట్ బయటికి రావాలన్న డబ్బుతో ముడిపడి ఉందన్నారు , అవినీతి అధికారులపై ప్రభుత్వం విచారణ జరిపి డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఇటువంటి అవినీతి అధికారులపై కూటమి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత 15 సంవత్సరాల నుండి నంద్యాల మున్సిపాలిటీలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు కానీ దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడం బాధాకరమని తెలిపారు. మున్సిపాలిటీలోని అవినీతి అక్రమాలను అంతం చేయడమే ఎస్ డీ పీఐ లక్ష్యం అని అన్నారు , ఇప్పటికీ ప్రభుత్వం మేలుకొనకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ నాయకులు ఫాసిల్ దేశాయ్, మజీద్ ఖాన్, కరిముల్లా, రిజ్వానాలం తదితర నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదికకు"80 ఫిర్యాదులు

### జిల్లా ఎస్పీ. అధిరాజ్ సింగ్ రాణా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07-నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 80 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ .యుగంధర్ బాబు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ కు 220 దరఖాస్తులు

### -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07-ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులను వితిన్ ఎస్ఎల్ ఏ లోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ . ఈ మేరకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వితిన్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, పట్టణ ప్రాంతాలలో చెత్తకుప్పలు పేరుకపోతున్నాయని పంచాయతీ సెక్రటరీలు,ఈవోఆర్డీలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పారిశుద్ధ్య చర్యలను ముమ్మరంగా చేపట్టాలన్నారు. రోడ్ల పక్కన ఉండే చెత్త కుప్పలను కాలిస్తే సంబంధిత పంచాయతీ సెక్రటరీలపై తీవ్ర కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో 220 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఏల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## ఫ్రెండ్ షిప్ కప్ క్రికెట్ విజేత గురు రాజా స్కూల్

### బహుమతి ప్రదానం చేసిన డాక్టర్ రవి కృష



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 07-నంద్యాల లయన్స్ క్లబ్, శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ స్టాఫ్ జట్టుకు మధ్య ఆదివారం రాత్రి ఫ్లడ్ లైట్స్ లో జరిగిన క్రికెట్ పోటీలలో గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ జట్టు విజేతగా నిలిచి ఫ్రెండ్ షిప్ కప్ ట్రోఫీ కైవసం చేసుకుంది. జట్టుకు 10 ఓవర్ల చొప్పున జరిగిన మూడు మ్యాచ్ లలో కూడా గురు రాజా జట్టు విజేతగా నిలవడం విశేషం. ప్రారంభ మ్యాచ్ లో 5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయానికి కావలసిన 66 పరుగులు సాధించి గురురాజా మ్యాచ్ గెలుచుకుంది. రెండో మ్యాచ్ లో లయన్స్ క్లబ్ 10 ఓవర్లలో 125 పరుగులు చేయగా గురురాజా 8 ఓవర్లలో విజయానికి కావలసిన పరుగులు సాధించింది. చివరి మ్యాచ్ లో మొదటి బ్యాటింగ్ చేసిన గురు రాజా 127 పరుగులు సాధించగా లయన్స్ క్లబ్ 102 పరుగులు మాత్రమే చేయడంతో గురు రాజా జట్టు మూడో మ్యాచ్ 25 పరుగుల తేడాతో గెలుచుకుంది. టోర్నమెంట్ ముగిశాక జరిగిన బహుమతి ప్రధానోత్సవం లో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేత గురు రాజా జట్టు షావలి రెడ్డి కి ఫ్రెండ్షిప్ కప్ ట్రోఫీ, రన్నర్స్ గా నిలిచిన లయన్స్ క్లబ్ కెప్టెన్ మనోహర రెడ్డికి రన్నర్స్ కప్ అందించి అభినందించారు. మూడు మ్యాచ్ లలో కలిపి 115 పరుగులు సాధించిన షావలి రెడ్డి బెస్ట్ బ్యాట్స్ మన్ గా, మూడు వికెట్లు సాధించి చక్కటి బౌలింగ్ ప్రదర్శన చేసిన చంద్రమౌళీశ్వర రెడ్డి బెస్ట్ బౌలర్ గా జ్ఞాపికలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఈ విధమైన క్రీడా పోటీలు ఉల్లాసం కలిగించి వృత్తి, ఉద్యోగాలలో మరింత మెరుగ్గా రాణించటానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో రెండు జట్ల సభ్యులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190